# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ పేదరికాన్ని తగ్గించేందుకు పీ4 పేరుతో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ భారత మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు నిర్వహించారు.
- ❖ పొదుపు సంఘాల ఉత్పత్తులకు ఆన్ లైన్ మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పిస్తున్నామని మంత్రి పి. నారాయణ వెల్లడించారు.
- ❖ అల్లూరి సీతారామరాజు జిల్లాలో మావోయిస్టుల ప్రభావం పూర్తిగా తగ్గిందని ఎస్పీ అమిత్ బర్దర్ అన్నారు.
- ❖ ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

======================

సమాజంలో ఆర్థిక అసమానతలను తగ్గించాలన్న లక్ష్యంతో పీ 4 పేరుతో కార్యక్రమాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని ముప్పాళ్లలో ముఖ్యమంత్రి ఈ రోజు పర్యటించి స్థానికంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పీ4లో భాగంగా 'మార్గదర్శి-బంగారు కుటుంబం' కింద రాష్ట్రంలోని 20 లక్షల కుటుంబాలను ఎంపిక చేశామని తెలిపారు. దేశంలోనే ఎక్కువ సామాజిక పింఛన్లను ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

======================

భారత మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఈ రోజు ఆయనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘన నివాళి అర్పించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ద్వారా చేసిన ట్వీట్ లో భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, ఆధునిక భారత దేశ నిర్మాణంలోనూ స్ఫూర్తివంతమైన సేవలు అందించారని కొనియాడారు. బాబు జగ్జీవన్ రామ్ చూపిన మార్గంలో కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని విజయవాడలో జరిగిన కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. మహోన్నత వ్యక్తిత్వం గల వ్యక్తి బాబు జగజ్జీవన్ రామ్ అని మైనార్టీ న్యాయశాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ తెలిపారు. బాబూ జగజ్జీవన్ రామ్ తన జీవితాన్ని సమాజానికి, దళితుల సంక్షేమానికి అంకితం చేసారని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు.

=====================

పొదుపు మహిళలందరికీ ఆర్థిక స్వావలంబన చేకూర్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అందుబాటులోకి తెచ్చిందని పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. విజయవాడలో ఈ రోజు జరిగిన మెప్మా రాష్ట్ర స్థాయి మహిళా వ్యాపారాభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక - వర్క్‌షాప్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మెప్మా వెబ్ సైట్, మొబైల్ యాప్ లను లాంఛనంగా ఆవిష్కరించారు. అనంతరం పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ... మెప్మా వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి కుటుంబంలో ఒకరిని వ్యాపార వేత్తగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పొదుపు సంఘాల సభ్యులు తయారు చేసే ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నామనిగా మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

=====================

రెండు రోజుల పర్యటన కోసం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఈ రోజు తిరుపతికి చేరుకున్నారు. స్థానిక విమానాశ్రయంలో ఆయనకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాగూర్ స్వాగతం పలికారు. తిరుపతిలో కాసేపు విశ్రాంతి అనంతరం తిరుమలకు రోడ్డు మార్గం ద్వారా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బయలుదేరి వెళ్ళారు. రేపు ఉదయం సుప్రభాతసేవలో ఆయన కుటుంబ సభ్యులతో కలసి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోనున్నారు. కాగా, సుప్రీంకోర్టు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, ఇతర ప్రముఖుల కోసం తిరుమల తిరుపతి దేవస్థానం తిరుమలలో ప్రత్యేక ఏర్పాట్లను చేసిందని అధికార వర్గాలు తెలిపాయి.

=====================

పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన వక్ఫ్ బిల్లు త్వరలోనే చట్టంగా మారుతుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. విజయవాడలో ఈ రోజు పాత్రికేయులతో ఆమె మాట్లాడుతూ... వక్ఫ్ బోర్డుకు సంబంధించి మాత్రమే సవరణలు చేశారని, మతపరమైన అంశంలో జోక్యం చేసుకోవడం లేదని స్పష్టం చేశారు. సవరణల ద్వారా వక్ఫ్ బోర్డులో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించారని చెప్పారు. వక్ఫ్ భూములను సరిగ్గా వినియోగిస్తే మైనార్టీల ఇబ్బందులు దూరమవుతాయని ఆమె అన్నారు.

విరామం

=====================

వైఎస్సార్ కడప జిల్లాలోని ఒంటిమిట్ట శ్రీ కోదండరాముడి శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ రోజు నుంచి అంకురార్పణతో ప్రారంభం అవుతున్నాయి. ఈనెల 15వ తేదీ వరకూ 10 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలలో భాగంగా రేపు ధ్వజారోహణం ఉంటుందని, 10వ తేదీన గరుడసేవ, 11వ తేదీన సీతారాముల కల్యాణం జరగనుందని ఆలయ వర్గాలు తెలిపాయి. కాగా, ఈనెల 11న రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు పట్టువస్త్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు.

=======================

అల్లూరి సీతారామరాజు జిల్లాలో మావోయిస్టుల ప్రభావం పూర్తిగా తగ్గిందని జిల్లా పోలీస్ సూపరెంటెండెంట్ అమిత్ బర్దర్ అన్నారు. గాలికొండ ఏరియా కమిటీకి చెందిన 11 మంది మావోయిస్టు పార్టీ సానుభూతిపరులు ఈ రోజు ఎస్పీ అమిత్ బర్దర్ ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయారు. ఈ సందర్భంగా ఎస్పీ పాత్రికేయులతో లొంగిపోయిన మావోయిస్టు సానుభూతిపరులకు ప్రభుత్వపరంగా రావలసిన అన్ని రాయితీలను అందేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొంటూ....

(వాయిస్ 24 సెకన్లు)

=======================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 11వ తేదీన ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఆగిరిపల్లిలో అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఈ రోజు పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. అగిరిపల్లి శివారు వడ్లమానులో హెలిప్యాడు, బహిరంగ సభకు సంబంధించి అధికారులు ప్రతిపాదించిన ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించారు. వేసవి దృష్ట్యా బహిరంగ ప్రదేశంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

=======================

పార్వతీపురం పట్టణంలో బెలగాం ఐటిడిఎ పెట్రోల్ బంక్ వద్ద అరకు కాఫీ దుకాణాన్ని తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామని పార్వతీపురం మన్యం జిల్లా ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ మేరకు ఆయన కాఫీ దుకాణాన్ని సంబంధిత అధికారులతో కలిసి ఈరోజు పరిశీలించారు. అరకు కాఫీకి మంచి ప్రాచుర్యం ఉందని, ఇటీవల పార్లమెంటు, శాసన సభలలోను కాఫీ అవుట్ లెట్‌లను ప్రారంభించారని చెప్పారు. జిల్లా ప్రజలందరికీ అరకు కాఫీ రుచులు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

=======================

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ఓ మోస్తరు వర్షాలు పడుతున్నాయి. దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఇప్పటికే ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఈ రోజు రేపు తేలికపాటి వర్షాలు కురవడానికి అవకాశం ఉందని అమరావతిలోని వాతావరణ శాఖ అధికారి తెలియచేస్తూ..

(వాయిస్ 29 సెకన్లు)

=======================

=======================